# 19025 వద్ద బలమైన నిరోధం




**సమీక్ష:** గత వారం మార్కెట్ స్థిరీకరణ దశలో నడిచింది. రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు, ఆర్థిక గణాంకాల కోసం మదుపర్లు ఎదురుచూడడంతో అధిక ఊగిసలాట కనిపించింది. వారాంతానికి సెన్సెక్స్ 18531 వద్ద స్థిరపడింది. ఐఐపీ, ద్రవ్యోల్బణ గణాంకాల కోసం మదుపర్లు వేచిచూడడంతో మార్కెట్ పెద్దగా మార్పు లేకుండానే ప్రారంభమైంది. అధిక ద్రవ్యోల్బణం, అధిక వడ్డీ రేట్ల విషయంలో ఆందోళనలు ఇంకా కొనసాగుతుండడంతో ఓ శ్రేణిలోనే కదలాడింది. అయితే ఎన్నికల ఫలితాలు సంస్కరణలను మరింత ముందుకు తీసుకెళతాయన్న భావనలతో శుక్రవారం మార్కెట్ లాభపడింది.

**ఎఫ్ఐఐల తీరు:** విదేశీ సంస్థాగత మదుపుదార్లు(ఎఫ్ఐఐలు) రూ.639 కోట్ల నికర విక్రయాలు చేశారు. అదే సమయంలో మ్యూచువల్ ఫండ్లు రూ.569 కోట్ల కొనుగోళ్లు చేయడం గమనార్హం.

**రంగాల వారీగా:** ఎఫ్ఎమ్‌సీజీ, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో మదుపర్లు పొజిషన్లను పెంచుకోవడంతో అధిక లాభాలను పొందాయివి. స్థిరాస్తి షేర్లూ కొనుగోళ్లను ఆకర్షించగలిగాయి. యంత్ర పరికరాలు లాభాల స్వీకరణకు గురయ్యాయి. బ్యాంకింగ్, చమురు షేర్లు కూడా దిగజారాయి. లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 3:2గా నమోదవడం తక్కువ స్థాయుల వద్ద కొనుగోళ్లు జరిగాయనడాన్ని సూచిస్తోంది.

**ఈ వారంపై అంచనాలు:** స్థిరీకరణ పొందిన సెన్సెక్స్‌కు 60 రోజుల చలన సగటు(డీఎమ్ఏ) అయిన 18712 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. దీనిపైన మార్కెట్ ముగిస్తే మాత్రం స్వల్పకాల ఊర్ధ్వముఖ ధోరణిలోకి ప్రవేశించవచ్చు. అదే జరిగితే 200 రోజుల చలన సగటు అయిన 19172 స్థాయి కీలక నిరోధంగా కొనసాగగలదు. ఒక వేళ సెన్సెక్స్ 18161 కంటే దిగువకు చేరితే స్వల్ప కాలంలో మార్కెట్ మరింత పడొచ్చన్న సంకేతాలను పంపినట్లు భావించాలి.

**ప్రభావితం చేసే అంశాలు:** ఎఫ్ఐఐల ధోరణి కొనసాగితే మార్కెట్లు మరింత పతనం చెందొచ్చు. యూపీఏ ప్రభుత్వం బహుళ బ్రాండ్ రిటైల్‌లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతినివ్వడానికి తుది రూపునిస్తోందన్న వార్తలు వస్తున్నాయి. ఇవి నిజమైతే మార్కెట్ సెంటిమెంటు బలపడవచ్చు. మరింత దిశ కోసం ముడి చమురు ధరలు, ఆహార ద్రవ్యోల్బణం, అమెరికా ఆర్థిక గణాంకాలను పరిశీలించాల్సి ఉంటుంది. త్రైమాసిక/వార్షిక ఫలితాలు యధావిధిగా ఎంపిక చేసిన స్క్రిప్‌లపై ప్రభావం చూపొచ్చు.

**తక్షణ మద్దతు స్థాయులు:** 18272, 17920, 17792; **తక్షణ నిరోధ స్థాయులు:** 18697, 18858, 19025

**స్వల్పకాలంలో మార్కెట్‌కు 19025 వద్ద బలమైన నిరోధం ఉంది.**

*–సతీశ్ కంతేటి, జెన్ మనీ*